నమస్తే తెలంగాణ
# జిందగీ
హైదరాబాద్
ఆదివారం 12 మే 2024
www.ntnews.com
II





HAPPY Mother's Day

‘గోల్డెన్ లేడీ ఆఫ్ టెలివిజన్’గా పేరున్న ఆమె ఆట, మాట, పాటలంటే అందరికీ మక్కువ. అందుకే ఆమెను పేరుతో కంటే అక్క, చెల్లి.. అని పిలిచే ఆప్తబంధువులే ఎక్కువ. ఔను.. యాంకర్‌గా, యాక్టర్‌గా, డ్యాన్సర్‌గా, సింగర్‌గా, రైటర్‌గా, ప్రొడ్యూసర్‌గా, బిజినెస్ వుమెన్‌గా.. అభిమాన బంధుగణాన్ని సంపాదించుకున్న మల్టీ టాలెంటెడ్ లేడీ ఉదయభాను. ఒక తల్లిగా తను ఆస్వాదిస్తున్న అనుభవాలను మాతృ దినోత్సవం సందర్భంగా ‘జిందగీ’తో పంచుకుంది జన హృదయభాను..



# అమ్మతనాన్ని ఆస్వాదిస్తున్నా!

**మాది** కరీంనగర్ జిల్లా కొహెడ. సుల్తానాబాద్‌లో ఉండేవాళ్లం. నాన్న ఆయుర్వేదిక్ డాక్టర్. సర్పంచ్‌గా కూడా పనిచేశారు. అమ్మానాన్నలిద్దరూ రచయితలే. నాన్న కలం పేరునే నాకు పెట్టారు. చిన్నప్పటి నుంచీ ఆటపాటల్లో చురుగ్గా ఉండేదాన్ని. ఐదేండ్ల వయసు నుంచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. చైల్డ్ ఆర్టిస్ట్‌గా రెండు సినిమాల్లో నటించాను కానీ అవి రిలీజ్ కాలేదు. తర్వాత ఆర్.నారాయణ మూర్తి గారు అవకాశం ఇచ్చారు. అప్పుడు నేను తొమ్మిదో తరగతి. అన్ని చానెళ్లలో రకరకాల పాత్రల్లో కనిపించాను. వన్స్ మోర్, సాహసం చేయరా డింభకా, పిల్లలు-పిడుగులు, ఢీ, రేలా రే రేలా తదితర కార్యక్రమాలు నా కెరీర్‌లో మైలురాళ్లు. పిల్లలు పుట్టిన తర్వాత మూడేండ్లు బ్రేక్ తీసుకున్నా. జీ తెలుగు ‘సూపర్ జోడీ’ ద్వారా తిరిగి ప్రేక్షకుల ముందుకు రావడం ఆనందంగా ఉంది. మళ్లీ బుల్లితెర హోస్ట్‌గా పేరు తెచ్చుకుంటా. ప్రాధాన్యమున్న పాత్ర అయితే సినిమాల్లోనూ చేస్తా.

### ఉద్దేశపూర్వకంగా..

ప్రేక్షకులకు వినోదం పంచేందుకు ఒక హోస్ట్‌గా ఆడటం, పాడటం, నవ్వించటం చేసేదాన్ని. స్టంట్స్ చేయడానికీ వెనుకాడలేదు. వరుస షోలతో బిజీగా ఉన్న సమయంలో నామీద పుకార్లు పుట్టించారు. సినీపరిశ్రమలో తెలుగు అమ్మాయిలకు ఆదరణ తక్కువ. అందులోనూ తెలంగాణ అంటే చిన్నచూపు. ఉద్యమం తారస్థాయికి చేరినప్పుడు పరిశ్రమలోనూ తెలంగాణ, ఆంధ్ర అనే ఫీలింగ్స్ ఎక్కువయ్యాయి. షూటింగ్‌కు ఒక రోజు ముందూ ప్రాజెక్టులు చేజారిపోయేవి. టైమ్‌కి రానని, లేట్గైతే ఉండనని, నా కాళ్లు విరిగిపోయాయని ప్రచారం చేసి నా కెరీర్‌ని ప్రశ్నార్థకంగా మార్చారు. అయినా నేనెప్పుడూ జడవలేదు. నా దారులన్నీ మూసేసినా కొత్త దారులు వేసుకుంటూ సాగిపోతున్నా. ఎలాంటి సపోర్టు, బ్యాక్‌గ్రౌండూ లేకుండా పరిశ్రమకు వచ్చి నేనేంటో నిరూపించుకున్నా.

### నేనే ఒప్పుకోలేదు..

ప్రత్యేక పాటల్లో చేయమని చాలా సినిమాల్లో అడిగారు. రోల్ ఏదైనా ప్రేక్షకులను అలరించాలి కానీ ఇబ్బంది పెట్టకూడదనేదే నా అభిమతం. అలా ఆలోచించి చేసిందే ‘లీడర్’ సినిమాలోని ‘రాజశేఖరా..’ సాంగ్. ఆ తర్వాత కూడా అవకాశాలు వచ్చినా నేనొప్పుకోలేదు. మా కుటుంబమంతా అల్లు అర్జున్ అభిమానులం. అంత పెద్ద హీరోతో కలిసి ఒక్కసారైనా స్క్రీన్ షేర్ చేసుకోవాలని ఉండేది. ఆయనెంత మంచి డ్యాన్సరో అందరికీ తెలిసిందే. ‘జులాయి’ సినిమాలో ఆయన పక్కన స్పెషల్ సాంగ్ కోసం నన్ను తీసుకోవడం ఆనందమనిపించింది.



### బాలకృష్ణ అంటే అభిమానం..

ఊహ తెలిసినప్పటినుంచీ ఇండస్ట్రీనే నా కుటుంబం. జీవితంలోని గొప్ప క్షణాలను వాళ్లతో పంచుకోవాలనుకున్నా. నా కూతుళ్లకు ఫంక్షన్ చేసినప్పుడు ఎవరికి ఫోన్ చేసినా సరిగ్గా స్పందించలేదు. ఒక్క బాలకృష్ణగారే తిరిగి కాల్ చేసి అటెండ్ అవుతానని మాటిచ్చారు. బాలయ్య మామ వచ్చి ఆశీర్వదించాడని ఇప్పటికీ నా కూతుళ్లు సంబురపడతారు. ఆయన మా ఇంటి సభ్యుడితో సమానం.

### చూస్తూ ఊరుకోలేను..

చిన్నప్పటినుంచీ ప్రశ్నించే తత్వం ఎక్కువ. పాటలంటే మక్కువ. అందుకే నేను హోస్ట్‌గా చేసిన కొన్ని షోస్‌లో పాడిన పాటల నిండా ప్రశ్నల కొడవళ్లే. అవన్నీ నేను రాసినవే. స్త్రీలపై వివక్ష, ఆడపిల్ల సమస్యలే నా పాటకు ప్రధాన వస్తువు. ఇప్పటికీ మార్కెట్లో నా ఆల్బమ్స్ ఉన్నాయి. యూట్యూబ్‌లోనూ నా పాటలకు మంచి ఆదరణ ఉంది. కష్టం తెలిసిన మనుషుల మధ్య పెరిగాను. రైతు కష్టం విలువ తెలుసు. నాకున్న కొంత భూమిలో వ్యవసాయం చేస్తున్నా. పంట పండించడం, నా చేత్తో వండిపెట్టడం చాలా ఇష్టం.

### అమ్మమ్మ చెప్పినట్టే..

చిన్నపిల్లలతో ఆడుకోవడమంటే మహా సరదా. కవలలంటే మరీ ఇష్టం. జంటగా ఉండే పండ్లు, కూరగాయలు కనపడగానే తీసుకుని తినేదాన్ని. అది చూసి మా అమ్మమ్మ ‘అముడాల పండ్లు తింటే అముడాలోళ్లు పుడతారు’ అనేది. ఆమె చెప్పినట్టే నాకు కవలలు పుట్టారు. ఇప్పుడు వాళ్లే నా ప్రపంచం. వాళ్లతో ఆనందంగా గడుపుతూ అమ్మతనాన్ని ఆస్వాదిస్తున్నా. నా భర్త కూడా నాకు అండగా ఉంటారు. మాకు గార్మెంట్ ఫ్యాక్టరీ ఉంది. మా పిల్లల పేరుతో ‘భుయువ్.కామ్’ www.bhuyuv.com అని ఒక వెబ్‌సైట్ స్టార్ట్ చేశాం. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఈ బ్రాండ్ మీద అన్నిరకాల గ్యాడ్జెట్స్, దుస్తులు అందిస్తున్నాం. నేరుగా చేనేత కార్మికుల నుంచి చీరలు కొనుగోలు చేసి వారికి ఉపాధి కల్పిస్తున్నాం. ఓ స్టూడియో నిర్మించి కొంతమందికైనా ఉపాధి కల్పించాలనేది నా ఆశయం. గొప్ప తలంపుతో మొదలుపెట్టిన స్టూడియో నిర్మాణం పూర్తికాకుండానే ఆధారంలేని కారణాలు చెప్పి నేలమట్టం చేశారు. స్టూడియో కూల్చగలిగారు కానీ నా ఆత్మస్థయిర్యాన్ని దెబ్బ తీయలేకపోయారు. తప్పకుండా స్టూడియో నిర్మిస్తా.. అనుకున్నది సాధిస్తా. సమాజంలో అణచివేతకు గురవుతున్న ఆడపిల్లలకు నా ప్రయాణం స్ఫూర్తిగా మారుతుందని ఆశిస్తున్నా.

... హరిణి

---

**అమ్మ మాటిస్తే సినిమా హిట్టు.**
**అమ్మ జోలపాట పాడితే సూపర్ హిట్టు.**
**అమ్మ పగసాధిస్తే.. బంపర్ హిట్టు.**
**అమ్మ సెంటిమెంట్ పక్కాగా పండితే రికార్డులు ఖాయం.**
**బాలీవుడ్ టు టాలీవుడ్ సినిమాకు అమ్మ రక్ష.**
**సినిమాకు అండగా ఉన్న అమ్మ పాత్రల్లో కొందరు నటీమణులు మకుటాయమానంగా నిలిచారు.**
**మాతృదినోత్సవం సందర్భంగా వెండితెర బంగారు తల్లులను గుర్తుచేసుకుందాం..**

# వెండితెర బంగారు తల్లులు

**‘ఆజ్** మేరే పాస్ బిల్డింగ్స్ హై.. ప్రాపర్టీ హై.. బ్యాంక్ బ్యాలెన్స్ హై.. బంగ్లా హై.. గాడీ హై.. క్యా హై తుమ్హారే పాస్...’ అమితాబ్ డైలాగ్! దానికి శశికపూర్ చెప్పిన ఒక్క మాట ‘మేరే పాస్ మాం హై’ అమితాబ్ ధరించిన పాత్ర అహంకారం బద్దలైంది. అంతకన్నా థియేటర్లలో సౌండ్ బాక్సులు బద్దలయ్యాయి. ‘దీవార్’ సినిమా కలెక్షన్లు రికార్డులు బద్దలుకొట్టాయి. ఆ ఒక్క డైలాగ్‌తో ‘దీవార్’ హీరో అమితాబ్‌కు వచ్చిన క్రెడిట్‌కు పదింతలు శశికపూర్ ఖాతాలో పడింది. దటీజ్ పవర్ ఆఫ్ మదర్!



‘నీ అమ్మ కాదురా.. నా అమ్మ.. నాకు మాత్రమే అమ్మ’ అని వస్తుకొల్ల మాటలకు ఛత్రపతి అభిమానులు కకావికలమయ్యారు. కండ్లెదుటే ఉన్న కన్నతల్లిని అమ్మ అని పిలువలేక, ఆమె కొడుకు తానే అని చెప్పలేక విలవిల్లాడుతున్న ‘ఛత్రపతి’ పాత్ర వెన్నంటే ఉన్నారు ఆడియన్స్ అంతా! కొడుకు కోసం ఆ తల్లి తల్లడిల్లినప్పుడల్లా ప్రభాస్ కన్నా ఎక్కువగా బాధపడ్డారు. క్లైమాక్స్‌లో ‘ఒట్టేసి ఒక మాట.. వేయకుండా ఒకమాట చెప్పనమ్మా!’ అని మాటలు చెవిన పడగానే.. హాలంతా ఈలలే!! తన పెద్దకొడుకు బతికే ఉన్నాడని ఆ తల్లి పొందిన ఆనందానికి అవధుల్లేవ్. ఛత్రపతి కలెక్షన్లకు హద్దుల్లేవ్!!

**సినిమా** సక్సెస్ ఫార్ములాలో అమ్మ పాత్రకు ఉన్న ప్రాధాన్యం అలాంటిది. కథానాయకుడికి కర్తవ్య బోధ చేయాలంటే అమ్మ రంగప్రవేశం చేయాల్సిందే! విలన్ అరాచకాలకు కళ్లెం వేయాలన్నా అమ్మ అడ్డుపడాల్సిందే! ఎన్ని బ్లాక్ అండ్ వైట్ సినిమాల్లో చూడలేదు!! క్లైమాక్స్‌లో జగ్గయ్య తుపాకీ పట్టుకొచ్చి.. హీరోకు గురిపెడతాడు. జగ్గయ్యకు అసలు తల్లి, హీరోకు పినతల్లి అయిన శాంతకుమారి పాత్ర అడ్డుపడుతుంది. అది గమనించకుండా జగ్గు ట్రిగ్గర్ నొక్కేస్తాడు. బుల్లెట్ తల్లికి తాకుతుంది. రక్తపు మడుగులో విలవిల్లాడుతున్న తల్లిని చూసి విలన్ మారిపోతాడు. కథ సుఖాంతం అవుతుంది. ఈ రోజుల్లో కాస్త కృతకంగా అనిపించినా... ఆ రోజుల్లో ఈ తరహా మదర్ సెంటిమెంట్ హిట్ ఫార్ములా!!

**ఆనాటి** ‘రోజులు మారాయి’ సినిమా నుంచి నిన్నమొన్నటి ‘సలార్’ వరకు అమ్మ పాత్రను అందలం ఎక్కించి.. వేడుక చేసుకున్న సినిమాలెన్నో ఉన్నాయి. ఆ తల్లి పాత్రల కోసమే పుట్టిన నటీమణులూ ఉన్నారు. సాధారణంగా ‘నిన్నటి కథానాయికలు.. నేటి కథానాయకుల తల్లులు’ అనే సంప్రదాయం ఇండస్ట్రీలో ఉంది. మహానటి సావిత్రి కూడా ఇందుకు మినహాయింపు కాదు. జమున, కృష్ణకుమారి, షావుకారు జానకి, అంజలీదేవి తదితర తొలితరం కథానాయికలు.. కృష్ణ, శోభన్‌బాబు సినిమాల్లో తల్లులుగా నటించి మెప్పించారు. రెండో తరంలో హీరోయిన్లుగా వెలుగొందిన శారద, వాణిశ్రీ, లక్ష్మి తదితర కథానాయికలు తర్వాతి జనరేషన్ నాయికానాయకులకు తల్లులయ్యారు. వీరిలో సెకండ్ ఇన్నింగ్‌లో వరుస విజయాలు సాధించిన అమ్మ పాత్రధారి మాత్రం శారదే! కెరీర్ మొదట్లో పద్మనాభం, చలం లాంటి హాస్యనటుల పక్కన పెంకిపిల్లగా నటించిన శారద.. కథానాయికగా ‘ఊర్వశి’ అనిపించుకుంది. తెలుగు సినిమా ఈస్ట్‌మన్ కలర్ నుంచి పూర్తి రంగులు సంతరించుకునే వేళకు పూర్తిస్థాయి అమ్మగా అవతారమెత్తింది. ఎనభై, తొంభైల్లో తిరుగులేని మాతృమూర్తిగా ఇండస్ట్రీకి రక్షగా నిలిచింది. చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్ లాంటి అగ్రహీరోల సినిమాల్లో తల్లిగా తన మార్కు నటన కనబరిచింది. ‘అమ్మ రాజీనామా!’ చిత్రం సంచలన విజయానికి కారణం శారద పాత్రే! ‘అడవిదొంగ’, ‘కొండవీటి దొంగ’, ‘మదర్ ఇండియా’, ‘జగన్నాటకం’ తదితర చిత్రాలు శారదలోని అమ్మదనాన్ని చిక్కగా చూపించాయి. ప్రభాస్ హీరోగా నటించిన ‘యోగి’ కలెక్షన్ల పరంగా విఫలమైనా.. శారద పాత్ర కలకాలం గుర్తుండిపోతుంది.




**1980ల్లో** నటి అన్నపూర్ణ రూపంలో తెలుగు వెండితెరకు నిండైన అమ్మ అండ దొరికింది. సినిమా సినిమాకు నాయికానాయకులు మారినా, దర్శకులు మారినా.. అమ్మ పాత్రలో మాత్రం అన్నపూర్ణే దర్శనమిచ్చేది. సగటు ప్రేక్షకుడు ఆమెలో సొంత తల్లిని చూసుకునేంతగా జీవించేది. హీరోయిన్‌గా సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన అన్నపూర్ణ ఒకట్రెండు సినిమాల తర్వాత వదిన, అక్క, అమ్మ పాత్రలకు షిఫ్ట్ అయింది. ‘ముందడుగు’ సినిమాలో కృష్ణ తల్లిగా ఆమె నటించింది. కథలో చాలా బరువైన ఆ పాత్ర కోసం ముందుగా శారదను అనుకున్నారట. చివరికి ఆ అవకాశం అన్నపూర్ణకు దక్కింది. సినిమా విడుదలయ్యాక రెండు వారాలకు వెలసిన పోస్టర్లలో అన్నపూర్ణ నిలువెత్తు ఫొటో వేయడంతో ఆమె వెండితెర తల్లిగా ఫిక్సయింది. వందల సినిమాల్లో తల్లి పాత్ర వేసినా.. ప్రతిసారీ తన ప్రత్యేకతను నిరూపించుకుంది.

**శారద,** అన్నపూర్ణ తర్వాత ఆ స్థాయిలో స్థిరమైన సిల్వర్ స్క్రీన్ మదర్‌గా జయసుధ పేరు తెచ్చుకుంది. ‘అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి’ సినిమాలో సహజ నటి తన మాతృత్వంతో ప్రేక్షకులకు మరింత చేరువైంది. ‘బొమ్మరిల్లు’లో కొడుకు కోసం తపన పడే తల్లిగా ఆమె పెర్ఫార్మెన్స్‌కు జనమంతా జై కొట్టారు. జోవియల్ మదర్, సీరియస్ మదర్ ఇలా ఏ తరహా తల్లి పాత్రకైనా జయసుధ ‘ద బెస్ట్’ అనిపించుకుంది. ‘సీతమ్మ వాకిట్లో..’, ‘శతమానం భవతి’ తరహా ఫ్యామిలీ బేస్డ్, సంప్రదాయ చిత్రాల్లో బరువైన అమ్మపాత్ర ఉంటే దర్శక నిర్మాతలు ముందుగా జయసుధను సంప్రదిస్తుంటారు.

**పైన** చెప్పుకొన్నట్టు.. వీరంతా అమ్మ పాత్రను బలంగా పండించి సినిమా భారాన్ని భుజానికెత్తుకున్న వాళ్లే! ‘మదర్ ఇండియా’, ‘కడప రెడ్డమ్మ’ సినిమాల్లో శారద పెర్ఫార్మెన్స్ కోసం రిపీటెడ్ ఆడియెన్స్ ఉండేవారు. ‘అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి’ సినిమాలో జయసుధ సీన్లు రిపీటెడ్‌గా చూసే అభిమానులు ఉన్నారు. ‘సాగర సంగమం’, ‘సీతాకోకచిలుక’ చిత్రాల్లో తల్లిగా డబ్బింగ్ జానకి ఎంత సహజంగా నటించిందో ఇప్పటికీ గుర్తుంటుంది. మొన్నటికి మొన్న బాహుబలిలో అమ్మదనానికి కొత్త నిర్వచనం ఇచ్చిన శివగామి పాత్రను ఎలా మర్చిపోగలం. ఆ పాత్ర, దాన్ని రమ్యకృష్ణ పండించిన తీరు రెండూ ఆ సినిమా విజయంలో ఎంతోకొంత పాత్ర పోషించాయని చెప్పక తప్పదు.

**ఇటీవల** సలార్‌లో ఈశ్వరీరావు పోషించిన తల్లి పాత్ర.. ప్రభాస్ లాంటి స్టార్‌డమ్ ఉన్న నటుణ్ని ఎలివేట్ చేయడానికి పనికొచ్చిందంటే.. అమ్మకున్న పవర్ ఏంటో తెలుస్తుంది. ఎలాగైతే అమ్మ గురించి ఎంత చెప్పినా సరిపోదో... వెండితెర తల్లుల గురించి కూడా ఎంత చెప్పినా కొంత మిగిలే ఉంటుంది. మదర్ సెంట్రిక్‌గా వచ్చిన కథలు ఎప్పుడూ హిట్టే! అమ్మ పాత్రను హీరోచితంగా చూపించిన సినిమాలూ హిట్టే! దటీజ్ ద పవర్ ఆఫ్ మదర్!





---

**చందమామ లాంటి అందం, అభిమానులను అలరించే నటన కాజల్ అగర్వాల్ సొంతం. టాలీవుడ్‌లో టాప్ హీరోయిన్‌గా ఉన్న సమయంలోనే పెళ్లి చేసుకుంది. కొన్నాళ్ల క్రితం మగబిడ్డకు జన్మనిచ్చి మాతృత్వంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నది. మదర్స్ డే సందర్భంగా కొడుకు ‘నీల్ కిచ్‌లు’పై తనకున్న ప్రేమను తెలియజేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక మెసేజ్ పెట్టింది కాజల్.**

# మాతృత్వాన్ని రుచి చూపించావ్..



**‘నిన్ను** మొదటిసారి ఎత్తుకున్నప్పుడు చిన్ని చిన్ని చేతులు, కళ్లను చూశాను. ఎప్పుడైతే నీ వెచ్చని ఊపిరి నాకు తగిలిందో ఆ క్షణమే నీతో ప్రేమలో పడిపోయాను. నువ్వు ఎప్పుడూ నా బంగారానివే. నువ్వు నా మొదటి బిడ్డవు. అంతేకాదు, ఎప్పటికీ మొదటివాడివే. రాబోయే రోజుల్లో నీకు ఎన్నో నేర్పుతాను. కానీ, నువ్వు నాకు ఇప్పటికే చాలా నేర్పించావు. అమ్మతనాన్ని రుచి చూపావు. నిస్వార్థంగా ప్రేమించడం ఎలాగో తెలిసేలా చేశావు. నా హృదయంలో ఒక భాగం నా చేతుల్లో ఒదిగిపోగలదని నిరూపించావు. ఎన్నో అనుభూతులను మొదటిసారి రుచి చూపించినందుకు థ్యాంక్స్.

మంచివాడిగా, ధైర్యశాలిగా, తెలివైన, చురుకైన, ఉన్నతమైన వ్యక్తిగా నువ్వు ఎదగాలని కోరుకుంటున్నాను. నువ్వే నా సూర్యుడు. నా చందమామ. నా నక్షత్రం.. ఈ మాటలు ఎప్పటికీ మరచిపోవద్దు’ అని రాసుకొచ్చింది కాజల్ అగర్వాల్.

---

# ఆ విషయం అమ్మకు తెలుసు



**వరుస సినిమాలతో టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా కొనసాగుతున్నది శ్రీలీల. ‘పెళ్లిసందD’ సినిమాతో తెలుగు నాట కెరీర్ ప్రారంభించిన ఈ భామ ఇండస్ట్రీలో బిజీ హీరోయిన్‌గా మారింది. ‘భగవంత్ కేసరి’ తో హిట్ కొట్టిన ఈ అమ్మడు.. ‘గుంటూరు కారం’తో భారీ విజయాన్ని అందుకుంది. ‘మా అమ్మ చాలా స్ట్రిక్ట్’ అని చెప్పే ఈ యంగ్ బ్యూటీ.. మాతృ దినోత్సవం సందర్భంగా తన తల్లి స్వర్ణలత గురించి ఇంకా ఏం చెప్పిందో చదివేయండి...**

**డాక్టర్** కావడం వల్ల అనుకుంటాను మా అమ్మకు ఓర్పు చాలా ఎక్కువ. అంతకుమించి నా మీద ప్రేమ కూడా. నేను ఎక్కడ ఉంటే అదే ఆమెకు ఫేవరెట్ ప్లేస్. అయితే, నా విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉండేది. నాకు ఏ విషయంలో స్వేచ్ఛ ఇవ్వాలి, ఏ విషయంలో ఇవ్వకూడదు అనే విషయం ఆమెకు బాగా తెలుసు. డ్యాన్స్, స్విమ్మింగ్, స్కూల్ అన్నిటితో రోజంతా బిజీబిజీగా గడిచిపోయేది. నాకు అల్లరి చేయాలని ఉన్నా అమ్మ కళ్లన్నీ నామీదే ఉండేవి. నా విషయాలను నేను హ్యాండిల్ చేయగలను అనే నమ్మకం వచ్చిన తర్వాత నాకు స్వేచ్ఛ ఇవ్వడం మొదలుపెట్టారు. అప్పటినుంచే మంచి ఫ్రెండ్ అయిపోయారు. ఇక, ఆమెతో అన్నీ షేర్ చేసుకుంటున్నా. షూటింగ్స్ లేనప్పుడు అమ్మతో ఎక్కువ సమయం గడుపుతుంటా. ఆమెకు కూతురుగా పుట్టడం నా అదృష్టం. చాలామంది పేషెంట్స్ ఆమెతో సన్నిహితంగా ఉంటారు. నేను ఈ రేంజ్‌లో ఉన్నానంటే దానికి కారణం అమ్మే. ఫెయిల్యూర్స్ వచ్చినా కుంగిపోకుండా ‘వాట్ నెక్స్ట్’ అంటూ ముందుకు సాగాలని ప్రోత్సహిస్తుంటారు. అందుకే అమ్మే నా ఇన్‌స్పిరేషన్.